batukammanews.com
TEL/2019/78873

బతుకమ్మ

31 అక్టోబర్ 2026
శనివారం

తాజా వార్తల సద్దిమూట

భర్తను అడ్డు తొలగించుకునేందుకు భార్య పథకం

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని ప్రియుడితో కలిసి హత్య

ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామంలో ఈ నెల 23న జరిగిన కాశీరామ్ అనే యువకుడిని హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

– బాన్సువాడ, బతుకమ్మ

2 లో

- సన్నబియ్యానికి బదులు దొడ్డుబియ్యం అప్పగింతలో సివిల్ సప్లయ్ ఆఫీసర్లు
- సస్పెండ్ అయినా కేసులు నమోదైనా వెనుకడుగు వేయని పౌర సరఫరాల శాఖ
- మిలర్లపై సిఐడి కేసుల నమోదు అరెస్టులతో సరి
- ఆఫీసర్ల గుట్టురట్టయ్యేదెన్నడూ?

సర్టిపై ఆఫీసర్లపై చర్యలేవి ?

2 లో

తెలంగాణ వ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిలు సుమారు 6 వేల కోట్లకు పరిమితమైన రికవరికి ప్రభుత్వం ఆపసోపాలు పడుతుంది. మిల్లర్లపై క్రిమినల్ కేసులు, రెవెన్యూ రికవరి యాక్టు, బ్లాక్ లిస్టులలో పెట్టినా మిల్లర్లు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. న్యాయస్థానాలను ఆశ్రయించడం ముందస్తు అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు ఉపశమనం పొందడం పరిపాటిగా మారింది. ఇప్పటికే కోట్ల రూపాయల బియ్యం ఎఫ్ సిఐకి చేరలేదనే మొర్రో అని ప్రభుత్వం మెత్తుకుంటుంటే మిల్లర్లు మరోసారి సీఎంఆర్ లనే కొత్త కుంభకోణానికి తెర లేపారు. ఈ నెల 24న పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ సిఐడి మిల్లర్లు సన్నవడ్లు తీసుకుని దొడ్డుబియ్యం (పాలిష్) అంటగట్టారని ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదైన విషయం తెల్సిందే.

– నిజామాబాద్, బతుకమ్మ

2 లో

రాష్ట్రంలో 1.50 లక్షల కోట్ల భూములు కాపాడం

సీఎం రేవంత్ రెడ్డి

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయస్థానాల్లో సమర్థవంతంగా పోరాడి రాష్ట్రంలో అన్యాక్రాంతం కాకుండా, ఇప్పటివరకు దాదాపు రూ. 1 లక్షా 50 వేల కోట్ల విలువైన భూములను కాపాడినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

– ఢిల్లీ, బతుకమ్మ

బీజేపీలోకి గజవాడ సోదరులు

ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరిక

కండువా వేసి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

2 లో

నిజామాబాద్ నగరానికి చెందిన గజవాడ సోదరులుగా ప్రసిద్దిగాంచిన రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ గజవాడ హనుమంతరావు, అతని సోదరుడు మాజీ కార్పొరేటర్ సివిల్ ఇంజనీర్ గజవాడ గణేష్ గుప్తలు బీజేపీలో చేరారు.నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురి ఆధ్వర్యంలో ఇద్దరు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

– హైదరాబాద్, బతుకమ్మ

సైబర్ నేరాలపట్ల ప్రజలు జాగృతులై ఉండాలి

నిజామాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలతో జాగ్రత్త ర్యాలీ

2 లో

ప్రజల అప్రమత్తతే ప్రమాదాలను దూరం చేస్తుంది

అదనపు పోలీస్ కమిషనర్ శుభం ప్రకాశ్

ప్రతి పౌరుడు సెల్ ఫోన్ వినియోగిస్తున్న డిజిటల్ కాలంలో తెలిసి తెలియకుండా సైబర్ నేరగాళ్ళ వలలో చిక్కుకుని ఆర్థికంగా నష్ట పోతున్నాడని నిజామాబాద్ జిల్లా అదనపు పోలీస్ కమిషనర్ శుభం ప్రకాశ్ అన్నారు. సెల్ ఫోన్‌లో డబ్బుల ఆశచూపి కొన్ని డబ్బులు మనకు ఆన్లైన్లో పంపించి మనతో ఎక్కువ డబ్బులు కాజేసే కేటుగాళ్లు సైబర్ నేరగాళ్ళని అన్నారు.

– నిజామాబాద్ క్రైం, బతుకమ్మ

బీజేపీలోకి గజవాడ సోదరులు

శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గజవాడ సోదరులను రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వారితో పాటు పలువురు రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, ఇంజనీర్లు బీజేపీలో చేరారు. నిజామాబాద్ అర్బన్ లో బీజేపీ బలోపేతానికి పార్టీ ఆదేశానుసారం పని చేస్తానని పార్టీలో చేరిన గజవాడ హనుమంతురావు, గణేష్ గుప్తలు తెలిపారు. గజవాడ హనుమంతురావు ప్రస్తుతం దిశ కమిటీ సభ్యులుగా పని చేస్తున్నారు. గజవాడ గణేష్ గుప్త వైశ్య సామాజిక వర్గంతో పాటు ఇతర సామాజిక సేవా రంగాలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

అర్బన్ ఎమ్మెల్యే గైర్హాజరు?

భారతీయ జనతా పార్టీలో నిజామాబాద్ నగరానికి చెందిన వైశ్య సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు చేరిక సమయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు పార్టీలో చేరుతుండగా లోకల్ ఎమ్మెల్యే హాజరుకా కపోవడంలో మతలబు ఏమిటని చర్చ జరుగుతుంది. వైశ్య సామాజిక వర్గంలో ధన్ పాల్, గజవాడ ఫ్యామిలీల మధ్య విభేదాలు ఉన్నాయనే విషయం అందరికీ తెల్సిందే. ఇప్పటి వరకు రెండు కుటుంబాలు వేర్వేరు రాజకీయ పార్టీలలో ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం అందరూ బీజేపీలో ఉండడంతో పార్టీ బలోపేతం అవుతుందని చెప్పవచ్చు. తన ఇంట్లో శుక్రవారం ఫంక్షన్ ఉన్న కారణంగానే అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హైదరాబాద్ లో జరిగిన బీజేపీలో చేరిక కార్యక్రమానికి హాజరుకాలేదని చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సర్టిపై ఆఫీసర్లపై చర్యలేవి?

రాష్ట్రంలో దాదాపు 242 కోట్ల విలువైన బియ్యం కుంభకోణం జరిగిందని 16 మిల్లర్లపై కేసు నమోదు చేసి 25న 14 మంది మిల్లర్లను సిఐడి అరెస్టు చేసిన విషయం విధితమే. ఎఫ్ సిఐకి సీఎంఆర్ అప్పగింతలో పౌర సరఫరాల శాఖ అధికారుల ప్రమేయం ఉందని ఆనాడు సిఐడి గుర్తించి నివేదిక సమర్పించింది. ఇదే విషయాన్ని ల్యాబ్ లలో బియ్యాన్ని పరీక్షించిన పౌర సరఫరాల శాఖ జనరల్ మేనేజర్ బియ్యంను సర్టిపై చేసిన అధికారుల వల్లనే ఎఫ్ సిఐకి సన్నబియ్యం బదులు దొడ్డుబియ్యం చేరిందని ఫిర్యాదు చేశారు. దానితో దొడ్డుబియ్యంను పాలిష్ చేసి సన్నబియ్యంగా ఎఫ్ సిఐకి అప్పగింతలో పౌర సరఫరాల శాఖాధికారుల ప్రమేయం బహిర్గతమైంది. ఎందుకంటే పౌర సరఫరాల శాఖ ఖరీఫ్, రబీ సీజన్ లలో వడ్ల కేటాయింపు మొదలుకుని ఎఫ్ సిఐకి సీఎంఆర్ అప్పగింతలో పౌర సరఫరాల శాఖ డీఎం మొదలుకుని డీఎస్ వో లప్రమేయం లేకుండా కేటాయింపులు, రికవరి జరుగదనే విషయం అందరికీ తెల్సిందే. సాధారణంగా వడ్లను కేటాయించిన తర్వాత సంబంధిత మిల్లులలో మర ఆడిస్తున్నారా అందులో స్టాక్ ఎంత అనే విషయాన్ని పౌర సరఫరాల శాఖ డీటీలు తనిఖీ చేసి నివేదిక ఇవ్వడం రోజువారి ప్రక్రియ. కానీ ఇటీవల కాలంలో విజిలెన్స్, టాస్క్ ఫోర్స్ టీంలు తనిఖీ చేస్తే కానీ మిల్లులకు కేటాయించిన వడ్లు బహిరంగ మార్కెట్లో అమ్ముకున్న విషయం కానీ బియ్యం పక్కదారి పట్టిన విషయం కానీ బహిర్గతం కావడం లేదు. ప్రధానంగా మిల్లర్లతో పౌర సరఫరాల శాఖాధికారులు మిలాఖత్ కావడం పరిపాటిగా మారిందనే విమర్శలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 16 మంది మిల్లర్లపై సిఐడి కేసులు నమోదు చేస్తే ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే ఆరుగురు రైసుమిల్లర్లపై కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశారు. అయితే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించిన యంత్రాంగం అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్న విషయాన్ని బహిర్గతం చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.నిజామాబాద్ జిల్లాలో పౌర సరఫరాల శాఖలో అధికారుల చేతివాటం కేసులు అనేవి పరిపాటిగా మారింది. 2023లో అప్పటి పౌర సరఫరా శాఖ డీఎంతో పాటు డీఎస్ వోను అధికారులు సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన సీఎంఆర్ కేటాయింపులో అధికారుల ప్రమేయంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి రాష్ట్రంలోని ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్న ఘనత ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే వెలుగు చూసింది.

దాని తర్వాత బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబానికి సంబంధించిన మిల్లులకు పరిమితికి మించి ధాన్యం కేటాయింపు, అసలు ఎలాంటి మిల్లులు లేకున్నా ధాన్యం కేటాయించారని కోటగిరి పోలీస్ స్టేషన్ లో నిజామాబాద్ అదనపు కలెక్టర్ పై కేసు కూడా నమోదైంది. ఆ కేసు ఇప్పటి వరకు కొలిక్కి వచ్చింది లేదు. ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ బకాయిలే వందల కోట్లు అంటే అతిశయోక్తి కాదు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 700 కోట్లపై చిలుకు సీఎంఆర్ బకాయిలు ఉన్నాయని, 56 మిల్లులకు గతంలో నోటీసులు ఇచ్చారు. అందులో కొందరు సీఎంఆర్ బకాయిలను చెల్లించడంతో పాటు మరికొందరు దానికి సరిపడ నగదును చెల్లించి అరెస్టుల నుంచి తప్పించుకున్నారు. కానీ మరికొందరు మొండిగా వ్యవహరించి న్యాయస్థానాలను ఆశ్రయించి కేసుల నుంచి ఉపశమనం పొందారు. సీఎంఆర్ కేటాయింపులు, సర్టిపై చేయడంలో పౌర సరఫరాల అధికారుల ప్రమేయంను సీఐడి గుట్టురట్టు చేసింది. ఇప్పటికే నలుగురు మిల్లర్లను అరెస్టు చేసిన సిఐడి ఈ నెల 31న స్వయంగా విచారించనుంది. మిల్లర్ల ప్రమేయం అయితే బహిర్గతమైన నేపథ్యంలో అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని చర్చ జరుగుతుంది.

సైబర్ నేరాలపట్ల ప్రజలు జాగ్రతులై ఉండాలి

డిజిటల్ అరెస్ట్ అంటు బెదిరించి డబ్బులు మాయం చేస్తారని డిజిటల్ అరెస్ట్ లే లేవని ఆయన తెలిపారు. ప్రజలు తమ డబ్బులు సెల్ ఫోన్ ద్వారా పంపించేటప్పుడు ఒకటికి పదిసార్లు వెరిఫై చేసుకుని పంపించుకోవాలని కోరారు. ప్రజల కష్టార్జితమైన డబ్బులు సైబర్ నేరగాళ్ళపరం కాకుండా ప్రజలే చైతన్యవంతులు కావాలని ఆయన ఆశిస్తు అందుకు పోలీసు శాఖ మద్దత్తు ఉంటుందని అన్నారు. సైబర్ నేరగాళ్ళ పరమైన డబ్బులు తిరిగి తెప్పించడం కష్టంతో కూడిన పని అని అయిన రికవరీ చాలా చేస్తున్నామని ఆయన తెలిపారు. ర్యాలీతో ఒక చైతన్యం, ఒక ఆలోచన, ప్రచారం ప్రజలలోకి వెళుతుందని బావించి ర్యాలీ నిర్వహించామని ఆయన తెలిపారు. నిజామాబాద్ జిల్లా కోర్టు నుండి ప్రారంభం అయిన ర్యాలీ పోలీస్ పెరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది అనంతరం శుభం ప్రకాష్ పోలీసులు, పౌరులను ఉద్దేశించి ప్రసంగించారు. ర్యాలీలో నిజామాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ప్రకాష్ యాదవ్, పోలీసు అధికారులు శ్రీధర్ రెడ్డి,ప్రసాద్,సత్యనారాయణ,సందీప్, హరిబాబు, యాదగిరి గౌడ్, సునీల్ కుమార్,న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేధార్, ఆశ నారాయణ, జగన్ మోహన్ గౌడ్, పిల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భర్తను అడ్డు తొలగించుకునేందుకు భార్య పథకం

ఈ హత్య కేసును ఛేదించి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ హన్మాజిపేట్ కు చెందిన కాశీరామ్ భార్య సవితకు, వరుసకు మరిది అయిన సంతోష్‌తో వివాహేతర సంబంధం ఉందని తెలిపారు. తమకు అడ్డుగా ఉన్న భర్త కాశీరామ్‌ను చంపాలనే ఉద్దేశంతో సవిత సంతోష్ కలిసి హత్యకు పథకం రచించారు. కాశీరాంకు రాము అనే యువకుడి ప్రియురాలితో వివాహేతర సంబంధం ఉంది. దాంతో ముగ్గురు కలిసి పథకం ప్రకారం ఈ నెల 23వ తేదీన కాశీరామ్‌కు మద్యం తాగించి, అనంతరం తాడుతో ఉరివేసి హత్య చేశారు. ఆ తర్వాత సంతోష్,?రాము కలిసి మృతదేహాన్ని హన్మాజీపేట్ చెరువులో పడేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన బాన్సువాడ పోలీసులు నిందితులైన సంతోష్,రాము, సవితలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చేదించిన పోలీసులను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు.

రాష్ట్రంలో 1.50 లక్షల కోట్ల భూములు కాపాడం

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మియాపూర్‌లోని 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు నేపథ్యంలో పార్లమెంట్ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రజల గొప్ప విజయమని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 లోని 550 ఎకరాల భూమిపై సర్వహక్కులూ ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు చారిత్రాత్మకమైన తీర్పుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. మియాపూర్‌లోని 550 ఎకరాలతో పాటు రాష్ట్రంలో మొత్తం 7 ప్రధాన ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములను పోరాడి సాధించినట్టు చెప్పారు. దాదాపు రూ. 50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్‌లోని ఆ భూములను రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. తెలంగాణలో కబ్జాదారుల ఆక్రమణల నుంచి కాపాడుకున్న ప్రభుత్వ భూములను ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం సాధించుకున్న భూములను ఇలాగే వదిలేస్తే అవి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం పొంచి ఉన్నందున ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం రక్షించిన భూముల్లో అటవీ శాఖకు చెందిన భూములను ఆ శాఖకు, అలాగే రెవెన్యూ శాఖకు చెందిన భూములను రెవెన్యూకు అప్పగిస్తామని చెప్పారు. వనరుల సమీకరణ కోసం నియమించిన మంత్రివర్గం ఉపసంఘం ఈ భూముల విక్రయం, తద్వారా వచ్చే నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై అధ్యయనం చేస్తుందన్నారు. ప్రధానంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి, నిరుపేదలకు విద్యను అందించడానికి, ఇందిరమ్మ ఇండ్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, ఇతర ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్ చుట్టూ, అలాగే రాష్ట్రంలోని విలువైన భూములను కొల్లగొట్టాలన్న ప్రయత్నాలు జరిగాయన్నారు. కాలనీల ముసుగులో రంగారెడ్డి మియాపూర్ 100, 101 కలిసి 550 ఎకరాల సర్కారు పోరంబోకు భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు, పెట్టుబడిదారులు కబ్జా చేయాలని చూశారని చెప్పారు. గత మూడేళ్లుగా నిరంతరం న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతూ, ఈ భూములను రక్షించాలని న్యాయస్థానంలో ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించి రూ. 50 వేల కోట్ల ఆస్తులను కాపాడగలిగామన్నారు. ధరణి ముసుగులో, రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడం, ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకునే విధంగా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా కొల్లగొట్టడానికి ప్రయత్నాలు జరిగాయని అన్నారు. ఐఎంజీ భూములను కొట్టేయాలని ప్రయత్నం జరిగితే న్యాయపోరాటంతో అడ్డుకోగలిగామని, కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు, మామిడిపల్లిలో 450 ఎకరాల భూములపై న్యాయస్థానంలో సమర్థవంతమైన పోరాటం ద్వారా సాధించామనీ, వేల కోట్ల విలువైన భూములను హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో బలమైన వాదనలు వినిపించడం ద్వారా కాపాడగలిగామన్నారు. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ కలాన్‌లో సర్వే నెం. 201లో 140 ఎకరాల భూమిని కాపాడామని, బలమైన వాదనల కారణంగా రాష్ట్రానికి, అటవీ శాఖకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో సర్వే నెం. 59లోని 36 ఎకరాల, దాదాపు రూ. 3,600 కోట్ల విలువైన భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తుండగా, ప్రభుత్వం అడ్డుకుని న్యాయస్థానంలో పోరాటం చేసింది. సెప్టెంబర్ 3, 2025న హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పు వెలువరించిందన్నారు. హైకోర్టు తీర్పుతో ఆ భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గండిపేట మండలం మంచిరేవులలో సర్వే నంబర్ 393లో 143 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నించగా, న్యాయస్థానంలో పోరాడి దాదాపు రూ. 10 కోట్ల విలువైన భూమిని రక్షించాం. మంచిరేవుల అత్యంత కీలకమైన ప్రాంతం. మూసీ రివర్ ఫ్రంట్‌ను ఆనుకొని, గ్రేహౌండ్స్ ప్రాంతంలో ఉన్న ఈ భూమిలో 50 ఎకరాలను యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కోసం కేటాయించాం" అని ముఖ్యమంత్రి వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ. 400 కోట్ల విలువైన 106 ఎకరాల అటవీ భూమిని ఒక రాజకీయ నాయకుడికి నజరానాగా అప్పగిస్తే, సుప్రీంకోర్టులో పోరాడి ఆ భూమిని కాపాడామని, అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూమిని ప్రైవేటు వ్యక్తులు కొల్లగొట్టాలని ప్రయత్నిస్తే న్యాయస్థానాల్లో పోరాటం చేయడం ద్వారా ప్రభుత్వం కాపాడగలిగిందని చెప్పారు. గడిచిన మూడేళ్లలో ఈ రకంగా 7 ప్రధానమైన భూములను ప్రభుత్వం కాపాడగలిగినట్టు ముఖ్యమంత్రి వివరించారు.

చిట్యాలలో శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి భూమిపూజ

పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి, బతుకమ్మ : తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీకృష్ణ మందిరం భూమిపూజ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ.. దేవాలయాలు గ్రామాల్లో ఆధ్యాత్మికతను??భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. శ్రీకృష్ణ మందిర నిర్మాణం గ్రామ ప్రజలకు ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తయి భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక??సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,

ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు

తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ధరలను అరికట్టాలి

సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ధరలను అరికట్టాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం, లోటు వర్షాల నేపథ్యంలో నిత్యావసరాల ధరలు ఇప్పుడే ఆకాశాన్ని అంటుతున్నాయని, మార్కెట్‌లో గత రెండు సంవత్సరాల క్రితం దాన్యం ను గోదాములలో దాచిపెట్టి ఎల్ నినో భూతం చూపెట్టి బ్లాక్ మార్కెట్ ద్వారా దందా చేస్తున్నారనీ, కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్నారు. ఇలాంటి వాటిపై ఒక టాస్క్‌ను అధికారుల బృందంతో ఏర్పాటు చేసి ఎల్ నినో ప్రభావం పోయేంత వరకు నిత్యావసరాల ధరలు ప్రభుత్వ నియంత్రణలో ఉండే విధంగా చర్యలు

తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యం ఒక వ్యక్తికి 6 కిలోల బియ్యం అందిస్తుందని, అది సరిపోవడం లేదని ఒక్కొక్కరికి 12 కిలోల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ మధ్య ప్రకటించినట్లు నిత్యావసర వస్తువులు అందించాలని, రేషన్ కార్డు లేని పేదలను, సంచార కుటుంబాలను గుర్తించి వారికి ఉచితంగా బియ్యం, నిత్యావసర వస్తువులు అందించాలన్నారు. ఉపాధి హామీలో పని దినాలను పెంచాలని, ఉపాధి లేక, జాబ్ కార్డు లేని వారికి ఉపాధి హామీలో పని కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలన్నారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీగా ఇస్తామని చెప్పిన 2,000 ఆర్థిక సహాయాన్ని ఈ సందర్భంలో ఇవ్వాలని, ప్రతి ఇంట్లో నీరు వృథా కాకుండా పట్టణాల్లో??పల్లెల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 9,000 ఆర్థిక సహాయం చేయాలన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున పంటలు పండించలేని స్థితి, కార్మికులు,కూలీలకు పని దొరకలేని స్థితి రాబోతుంది కావున విద్యార్థుల ఫీజులు మాఫీ చేయాలి ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి.ప్రభుత్వ ఉద్యోగుల జీతాల నుండి ప్రతి సంవత్సరం కట్ చేస్తున్న హరిత నిధిని ప్రస్తుత విపత్తు సమయంలో ప్రజల కోసం ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సూర్య శివాజీ, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరు భూమయ్య,ఐఎఫ్టియు నాయకులు శివ కుమార్, మోహన్,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మాల సంఘాల జెఏసి జిల్లా చైర్మెన్ గా బండి రవీందర్

ఆర్మూర్, బతుకమ్మ : మాల సంఘాల జెఏసి నిజామాబాద్ జిల్లా చైర్మెన్ గా నందిపేట మండలం వన్నెల్ (కే) కు చెందిన బండి రవీందర్ ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఏసి చైర్మన్ మందాల భాస్కర్ తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆయన ఈ మేరకు మాల సంఘాల జెఏసి జిల్లా చైర్మెన్ ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. మాలలను ఐక్యం చేసి ఉద్యమించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మలాల చైతన్య కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. త్వరలో నిజామాబాద్ జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నామని అన్నారు. జిల్లాలో అన్ని మాల సంఘాలు??యువజన??విద్యార్థులు సంఘాలు కలిసి పని చేయాలని కోరారు. అన్ని వర్గాల మాలలు కలిసి రావాలని కోరారు. జిల్లా చైర్మెన్ గా ఎన్నిక అయిన బండి రవీందర్ మాట్లాడుతూ జిల్లా చైర్మెన్ గా తన బాధ్యతను తప్పకుండా నిర్వహిస్తానని అన్నారు. అందుకు మాలలలు కలిసి రావాలి కోరారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జెఏసి నేతలు రాహుల్,

లింగన్న,సంజీవ్ లు పాల్గొన్నారు.

ఢిల్లీ నిరసన కార్యమానికి బయలుదేరి వెళ్లిన బాల్కొండ కాంగ్రెస్ నేతలు

భీమ్ గల్, బతుకమ్మ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు బాల్కొండ కానిస్టేన్సీ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ నిరసన కార్యక్రమానికి శుక్రవారం బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ కానిస్టెన్సీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు బస్సులో బయలుదేరి వెళ్లారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 1 న ఢిల్లీలోని రాంలీల మైదాన్ లో నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమంలో వీరు పాల్గొననున్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలి..

– ఎస్సై ఎల్. రామ్

రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఎస్సై ఎల్. రామ్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాలు, రోడ్డు భద్రత నియమాలు, షీ టీం పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. సైబర్ మోసానికి గురై డబ్బులు కోల్పోతే లేదా ఆన్‌లైన్ వేధింపులు ఎదురైతే, ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని బృందం, విద్యార్థినిలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి లేకుంటే చర్యలు...

రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : గ్రామ పంచాయతీ బకాయిలు ఉంటే వెంటనే చెల్లించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ ప్రేమ్ దాస్ దుకాణదారులకు సూచించారు. రుద్రూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పన్నుల వసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది ప్రతి దుకాణ సముదాయానికి తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని, పన్నులు సకాలంలో చెల్లించాలని, బకాయిలు చెల్లించని వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కారోబార్ రాజు, సిబ్బంది ఉన్నారు.

భీమ్‌గల్ న్యాయస్థానంలో

ఏపీపీ ఛాంబర్ ప్రారంభం

నేటి నుంచే ప్రారంభమైన సాక్ష్యాల నమోదు ప్రక్రియ

భీమ్ గల్, బతుకమ్మ :భీమ్ గల్ పట్టణంలో ఇటీవలే నూతనంగా ఏర్పాటైన న్యాయస్థానంలో శుక్రవారం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) ఛాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నేటి నుంచి కోర్టులో కేసులకు సంబంధించి సాక్ష్యాల నమోదు (ఎవిడెన్స్ ప్రొసీడింగ్స్) ప్రక్రియను ప్రారంభించారు. నూతన కోర్టులో సాక్ష్యాల నమోదు ప్రక్రియ అందుబాటులోకి రావడంతోఈ ప్రాంత ప్రజలు, న్యాయవాదులు, కక్షిదారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇకపై న్యాయపరమైన వ్యవహారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కానున్నాయి. స్థానికంగానే న్యాయ సేవలు అందుబాటులోకి రావడం కోర్టు అభివృద్ధిలో మరో కీలక ముందడుగుగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భీమ్ గల్ న్యాయవాదులు గజ్జల చైతన్య, సూర సురేష్, ఎస్ఐ తిరుపతి, మోర్తాడ్ ఎస్ఐ రాము, కోర్టు కానిస్టేబుల్ రమణ (భీమ్ గల్), రాజు (కమ్మర్‌పల్లి), అనిల్ (సిరికొండ), హరి (మోర్తాడ్), ఎర్గట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ తప్పనిసరి

జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్

కోటగిరి, బతుకమ్మ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులతో పాటు అధ్యాపకులు బోధనేతర సిబ్బందికి ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ తప్పనిసరి అని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ అన్నారు. శుక్రవారం వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల,కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలో ప్రిన్సిపాల్, బోధన,బోధనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ఉదయం పదిన్నర లోగా తీసుకోవడం అధ్యాపకుని విధి అని స్పష్టం చేశారు. అలాగే అధ్యాపక బృందం బోధనేతర సిబ్బంది బృందం సమయ పాలన పాటించాలని ఆదేశించారు. అధ్యాపకులందరూ నవంబర్ నెలలో సిలబస్ పూర్తి చేసి ప్రాక్టికల్స్ కూడా బోధించేందుకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. సిలబస్ పూర్తి చేసిన వెంటనే అర్ధవార్షిక పరీక్షలను నెలవారి పరీక్షలను పూర్తి చేసి విద్యార్థుల మార్కులను నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థిని విద్యార్థుల ప్రతిభ ఆధా రంగా గుర్తించి, వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి ఆదేశించారు. సర్వ శిక్ష అభియాన్ కార్యక్రమం కింద కళాశాలలకు మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. కళాశాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకుగాను ప్రిన్సిపాల్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇంటర్ విద్యార్థి ఆదేశించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినందున బోధనేతర సిబ్బంది తమ ఫైలు లో అన్ని వివరాలు క్రమ పద్ధతిలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి చేత పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి ఆదేశించారు. ఈ సమావేశాలలో వర్ని కళాశాల ప్రిన్సిపల్ కల్పనా కుమారి, కోటగిరి ప్రిన్సిపల్ కౌసర్ పాషా తో పాటు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పిహెచ్‌ఎస్ చద్మల్ తాండ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన గ్రామ సర్పంచ్

ఎల్లారెడ్డి, బతుకమ్మ : గాంధారి మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ చద్మల్ తాండ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ బస్సి దేవి సింగ్, ఉప సర్పంచ్ ప్రవీణ్ నాయక్, గ్రామ పెద్దలు జగదీష్ విద్యార్థులతో భోజనం నాణ్యత అడిగి తెలుసుకున్నారు.మధ్యాహ్న భోజన రుచి చూసి వారంతపు అరటి పండ్లు,గుడ్లు భోజనం సమయంలో వంటకాలలో ఉపయోగించే రోజు వారి వడ్డించే వివిధ విషయాల గురించి అడిగి తెల్సుకోవడం జరిగింది.మధ్యాహ్న భోజనం ఏజెన్సీ వారికి మెనూ ప్రకారం వడ్డించాలని సూచించడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు షూస్ ల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ప్రవీణ్ నాయక్,జగదీష్,కెథి లాభాన విద్యార్థి నాయకుడు గోపాల్,నారాయణ,పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్,గ్రామ పెద్దలు మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బతుకమ్మ

పిప్రిలో ఈ-శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు

ఆర్మూర్, బతుకమ్మ : పిప్రి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీశైలం మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పని చేసే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా ఈ-శ్రమ్ కార్డు నమోదు చేసుకోవాలని, దీని ద్వారా రూ. 2 లక్షల ప్రమాద భీమా,ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా పొందే అవకాశం కలుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్, సర్పంచ్ కిరణ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, కారోబరి శేఖర్, వార్డు సభ్యులతో పాటు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ యాత్ర ప్రారంభం

జెండా ఊపి బస్సును ప్రారంభించిన కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్

కామారెడ్డి, బతుకమ్మ : ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల ఓటు హక్కుల సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించనున్న ఛలో ఢిల్లీ ప్రజాస్వామ్య ర్యాలీ కార్యక్రమంలో పాల్గొనేందుకు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జెండా ఊపి ఛలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరిన బస్సును లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఢిల్లీ పర్యటనకు పయనమయ్యారు. ప్రజల ఓటు హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో పాల్గొనేందుకు కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున తమ భాగస్వామ్యాన్ని తెలియజేస్తూ, దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ర్యాలీలో పాల్గొనేందుకు జిల్లా నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

ఢిల్లీకి బయలుదేరిన జిల్లా కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నవంబర్ 1న జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో రాంలీలా మైదాన్ లో జరిగే ఓట్ బచావో దేశ్ బచావో భారీ సభకు నిజామాబాద్ అర్బన్ నుంచి శుక్రవారం బస్సులలో కాంగ్రెస్ నాయకులు భారీగా బయలుదేరారు. నగర కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, డీసీసీమాజీ అధ్యక్షులు గడుగు గంగాధర్, నగర మేయర్ ఉమారాణిలు జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ సభను విజయవంతం చేయడానికి నిజామాబాద్ నగరంలోని అన్ని డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులను ఒకతాటిపైకి తెచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నిజామాబాద్ నగరం నుండి బస్సుల ద్వారా, ట్రైన్ ల ద్వారా, విమానాల ద్వారా ఇతర రవాణా సౌకర్యాల ద్వారా సుమారు 100 మందికి పైగా ఢిల్లీకి బయలుదేరడం జరుగుతుందని తెలిపారు.

దళిత గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరిగితే ఊరుకోం

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న

హైదరాబాద్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్రంలో దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు,అన్యాయాలు జరుగుతున్నాయని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నానని?తమ దళిత, గిరిజన జర్నలిస్టులపై అన్యాయం జరిగితే ఊరుకోబోమని తెలంగాణ ఎస్సీ,ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న హెచ్చరించారు. హైదరాబాద్ లోని పద్మిని హోటల్ లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమ దళిత, గిరిజన జర్నలిస్టులపై జరుగున్న దాడులు, అన్యాయాన్ని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు ముఖ్యంగా పోలీసులు వెంటనే నిలిపివేయాలని అయన డిమాండ్ చేశారు. ఇటీవల సిరిసిల్లాకు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై కరీంనగర్ పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించడం దారుణమని ఈ విషయంలో బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వారిపై చర్యలు తీసుకునే వరకు ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా దళిత,గిరిజన జర్నలిస్టులను ఐకమత్యం చేస్తూ జిల్లా కమిటీలు లేని అన్ని జిల్లాలలో జిల్లా కమిటీలను పూర్తి చేస్తామన్నారు. అలాగే జిల్లా కమిటీల నిర్మాణం పూర్తయిన తరువాత త్వరలోనే రాష్ట్ర ద్వితీయ మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులకు అందించే అక్రిడిటేషన్ల జారీ విషయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో దళిత, గిరిజన జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇంకా జరుగుతూనే ఉందని, దీనికి ప్రధాన కారణం దళిత,గిరిజన జర్నలిస్టులు అక్రిడిటేషన్ కమిటీలలో లేకపోవడమేనని అన్నారు. అర్హులైన దళిత,గిరిజన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు,ఇండ్ల స్థలాలు అందించే వరకు తమ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పోరాటం ఆగధని అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడి చేసినప్పటికి ప్రభుత్వం విధానంలో మార్పు లేదని విమర్శించారు. ప్రభుత్వ విధానం,రాష్ట్ర ముఖ్యమంత్రి పద్ధతి మార్చుకోకపోతే తమ తఢాఖా ఏందో చూపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక నాయకులు అరెల్లి మల్లేష్,రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, తెడ్డు సాయిలు,చుంచు బాబు,సంయుక్త కార్యదర్శి ఈరోల్ల పురుషోత్తం, ఆర్గనైజింగ్ కార్యదర్శి అరుణ్, ఉత్సవ కమిటీ రాష్ట్ర చైర్మన్ సంతోష్, కో కన్వీనర్ సురేష్,నాయకులు వెంకన్న,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వాదుల సంగమం సదస్సును విజయవంతం చేయండి

పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నవంబర్ మూడో తేదీ నాడు భాగ్యనగరంలోని నాగోల్ శుభం కన్వెన్షన్ లో జరుగుతున్న పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు, జాతీయవాదుల కలయిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కేంద్రంలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పూర్వ విద్యార్థి పరిషత్ నాయకులు జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థి పరిషత్ లో అనేక దశాబ్దాలుగా పనిచేసిన ఎక్కడెక్కడో స్థిరపడ్డటువంటి ఉస్మానియా కాకతీయ యూనివ ర్సిటీలతో పాటు రాష్ట్రంలో ఉన్నటు వంటి పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు అందరిని ఒక దగ్గరికి తీసుకురా వడం కోసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. సంస్థ సిద్ధాంతం కోసం యూనివ ర్సిటీలలో, హాస్టల్లో నక్సలైట్ల కు, రాడికల్స్ కు వ్యతిరేకంగా పనిచేసే అనేక క్యాంపస్ లను కాషాయం చేసిన టువంటి పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్తల యొక్క సమూహం ఒక వద్ద కలుసుకొని సదస్సు నిర్వహించడం శుభ పరిణామమన్నారు.ఈ కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు ఏ స్థాయిలో ఉన్న ఏ రంగంలో ఉన్న అందరూ హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి పరిషత్ జాతీయ కార్యదర్శి బిజెపి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సునీల్ బన్సల్, కాసం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారు అని తెలిపారు.ఈ పోస్టల్ ఆవిష్కరణ కార్యక్రమంలో అడ్లూరి శ్రీనివాస్?యెండల సుధాకర్, స్వామి యాదవ్, చైతన్య, బిట్లరవి, బాలాజీ, వెంకటేష్, శరత్ చంద్రా, నవీన్, సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట్ సబ్ స్టేషన్‌లో

5 కెవిఈ పీటీఆర్ ఏర్పాటు

వేల్పూర్, బతుకమ్మ :మండలంలోని రామన్నపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ లో శుక్రవారం విద్యుత్ అధికారులు కొత్త 5కెవిఈ పీటీఆర్ ను ఏర్పాటు చేసి ప్రారంభించారు.సబ్ స్టేషన్ పరిధిలో గత కొన్ని రోజులుగా లోవోల్టేజి సమ స్య నెలకొన్న నేపథ్యం గ్రామంలోని ల రైతుల వ్యవసాయ మోటార్లు, మిషన్ భగీరథ సంపులో మోటర్లు, ఇళ్లల్లో టీవీలు, ఫ్రిడ్జ్ లు, ఫ్యాన్లు, బల్బులు కాలిపోవడం జరిగింది. ఈ విషయాన్ని సర్పంచ్ నవీన్ సంబంధిత విద్యుత్ అధికారులకు తెలియజేయడంతో స్పందించడం జరిగింది. సమస్య తెలుపగానే స్పందించి సహకరించిన సీఎం పీడీసీల్ వరంగల్ వరుణ్ రెడ్డి , సూపరిండెంట్ ఇంజనిర్ పీవీ రాజేశ్వర్ రావు, డీ ఈ. బి.రఘు, ఏ డీ. కె నాగేశ్వరావు, ఏ డీ.కె.నటరాజ్,ఏ. ఈ. జె.రమేష్ లకు సర్పంచ్ నవీన్ గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. విషయం తెలుపగానే అధికారులతో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్, బాల్కొండ బీజేపీ ఇంచార్జ్ డా.మల్లికా ర్జున్ రెడ్డి ల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెడ్డు గోవర్ధన్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు సబ్ స్టేషన్ సిబ్బంది, ఆపరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్సై...

ఇందల్వాయి,బతుకమ్మ :ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఇందల్వాయి ఎస్సై భూక్య సుమలత ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు, శుక్రవారం పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు తుపాకుల వినియోగం తుపాకుల వాడకంపై అవగాహన సదస్సును ఇందల్వాయి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, రిసెప్షన్ సెంటర్ విధులు, వీహెచ్ఎఫ్ సెట్ వినియోగం, ఆయుధాగారం, లాకప్ నిర్వహణ, బ్లూ కోల్ట్స్ సిబ్బంది విధులు, పెట్రోల్ కార్ పరితీరు, గురించి వివరించడం జరిగింది, పోలీస్ శాఖ విధులు ప్రజలకు అందించే సేవలను ఆమె విద్యార్థిని విద్యార్థులకు క్షుణ్ణంగా వ్యవహరించారు, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర గురించి ఆమె సైతం విద్యార్థిని విద్యార్థులకు వివరించారు, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవశీ సందర్భంగా ఇందల్వాయి పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలు వచ్చిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

ఢిల్లీకి తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు...

రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : సర్ ప్రక్రియ పై ఢిల్లీలో నవంబర్ 1 వ తేదీన జరగబోయే ధర్నాలో పాల్గొనేందుకు రుద్రూర్ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం రాత్రి ఢిల్లీకి తరలివెళ్లారు. ఢిల్లీకి బయలుదేరిన వారిలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, నాయకులు పార్వతి ప్రవీణ్, కాసుల మహేష్, గౌస్ తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్ కాలనీలో పర్యటించిన సర్పంచ్, అధికారులు..

రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, ఎంపీఓ అరవింద్, పంచాయతీ సెక్రెటరీ ప్రేమ్ దాస్ లు శుక్రవారం రాత్రి పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ, తాగు నీటి వంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులకు త్రాగునీటి కొరకు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఎల్ నినో ప్రభావం వలన నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

బోర్వేల్ రీఛార్జ్ స్ట్రాక్టచర్‌కు భూమి పూజ

భీమ్ గల్, బతుకమ్మ :మండలంలోని పురానిపేట్ గ్రామంలో విబిజీ రామ్ జి పథకంలో భాగంగా నిర్మించతలపెట్టిన బోర్వేల్ రీఛార్జ్ స్ట్రాక్చర్ పనులకు ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ శుక్రవారం భూమిపూజ చేశారు. బోర్వేల్ రీఛార్జ్ స్ట్రాక్చర్ వల్ల బోర్ లు డ్రై కాకుండా కాప్పుడుకోవచ్చునన్నారు. అనంతరం అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న నీటి సంరక్షణ పాండ్ ను ఆయన పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కూలిలకు పనులు నాణ్యంగా చేయాలని ఆయన సూచించారు. తదనంతరం గ్రామ నర్సరీని సందర్శించారు. ఈ సంవత్సరం 5000 ల మొక్కలను పెంచలన్నారు. అందులో ప్రజలకు ఉపయోగపడే పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను పెంచాలని ఎంపీడీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర సుమ దేవేందర్ గౌడ్, మిషన్ భగీరథ ఏఈ అమూల్య, ఏపీఓ నర్సయ్య, పంచాయతీ సెక్రటరీ, జి. పి పాలక వర్గం, ఫీల్డ్ అసిస్టెంట్, మెట్లు, కూలీలు పాల్గొన్నారు.

నీటి పొదుపు అంటూనే మిషన్ భగీరథ నీరు వృధా...

రుద్రూర్, బతుకమ్మ : ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాభా వం, తాగునీటి ఎద్దడి తప్పదని, ప్రజలంతా నీటిని పొదుపుగా వాడు కోవాలని అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నప్పటికీ కాలనీవాసులు మాత్రం అవేమి పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన మిషన్ భగీరథ నీరు మాత్రం రుద్రూర్ మండల కేంద్రంలో కొన్ని చోట్ల వృధాగా రోడ్లపైకి పారుతున్నాయి. 24 గంటలు మిషన్ భగీరథ నీరు వృధాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృధాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత కుట్టుమిషన్‌ల పంపిణీలో ప్రాధాన్యం ఇవ్వాలి...

రుద్రూర్, బతుకమ్మ : ఉచిత కుట్టుమిషన్ల పంపిణీలో మేరు కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం రుద్రూర్ మండల పరిషత్ కార్యాలయంలో మేరు కులస్తులు వినతిపత్రం సమర్పించారు. కుల వృత్తితో పాటు కుట్టుపనిపై ఆధారపడి జీవిస్తున్న పేద మేరు కులస్తులకు ఉచితంగా కుట్టుమిషన్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిషన్లు కొనుగోలు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మేరు కులస్తులు కౌలస్ గంగాధర్, సందీప్ తదితరులు ఉన్నారు.

నిజామాబాద్ జిల్లాలో మద్నూర్ విలీనం?

గ్రామసభ తీర్మానాల సేకరణకు అధికారుల ఆదేశాలు

మద్నూర్, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా పరిధిలోని మద్నూర్ మండలాన్ని నిజామాబాద్ జిల్లాలో కలపాలనే డిమాండ్‌పై అధికారికంగా ముందడుగు పడింది. ఈ విలీన ప్రతిపాదనకు సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అధికారులు కదలికలు ప్రారంభించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతుల ఆధారంగా, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి గ్రామసభ తీర్మానాల ప్రతులను సేకరించాలని ఉన్నతాధికారులు సూచించారు.ఈ మేరకు అక్టోబర్ 24న మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి అధికారికంగా లేఖ జారీ అయింది. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి, ప్రజల ఆమోదంతో కూడిన తీర్మాన కాపీలను త్వరితగతిన సేకరించి స్థానిక తహసీల్దార్‌కు సమర్పించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అధికారుల నుంచి ఈ ఆదేశాలు రావడంతో మద్నూర్ మండల వ్యాప్తంగా విలీన అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.పరిపాలనా సౌలభ్యం కోసమేనా?మద్నూర్ మండలం భౌగోళికంగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటంతో ప్రజలు కొంత ఇబ్బంది పడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో కలిపితే పరిపాలనా సౌలభ్యం మెరుగవుతుం దని, రవాణా సదుపాయా లు, ప్రభుత్వ కార్యాలయాల కు చేరుకునే మార్గాలు సులువవుతాయని స్థానికులు భావిస్తున్నారు. ఈ మార్పు ద్వారా ప్రాంతీయంగా మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.ప్రతి గ్రామంలోనూ ప్రజల వాస్తవ అభిప్రాయాలను తెలుసుకుని, వారు ఇచ్చే గ్రామసభ తీర్మానాలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక నాయకులు, ప్రజలు కోరుతున్నారు. అయితే, ప్రస్తుతం కేవలం తీర్మానాల సేకరణ ప్రక్రియ మాత్రమే మొదలైందని, జిల్లా మార్పుపై ప్రభుత్వం నుండి ఎలాంటి తుది నిర్ణయం ఇంకా వెలువడలేదని అధికారులు స్పష్టం చేశారు.

పీఎం కిసాన్ నిధుల విడుదలను ప్రత్యక్షంగా వీక్షించిన రైతులు

మద్నూర్, బతుకమ్మ :కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' నిధుల విడుదల కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల రైతులు, అధికారులు శుక్రవారం ప్రత్యక్షంగా వీక్షించారు. మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ సౌజన్య రమేష్, కార్యాలయ పర్యవేక్షకుడు రామచందర్ మరియు స్థానిక రైతులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సౌజన్య రమేష్

మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ పెట్టుబడి సాయం రైతులకు సాగు ఖర్చుల సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని, వారి ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లోకే నిధులు జమ చేయడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఢిల్లీ కాంగ్రెస్ ఆందోళనకు తరలిన మద్నూర్ నేతలు

మద్నూర్, బతుకమ్మ :దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న భారీ ఆందోళన కార్యక్రమానికి మద్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ నేతృత్వంలో జిల్లాలోని పలువురు ముఖ్య నేతలు ఈ నిరసనలో పాల్గొనేందుకు ఢిల్లీకి బయలుదేరారు.మద్నూర్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, జిల్లా ఉపాధ్యక్షుడు యూనుస్ పటేల్, జిల్లా కార్యదర్శి సంతోష్ పటేల్ ఈ ఆందోళనలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "తెలంగాణ గళం.. బలం చూపిద్దాం" అనే పిలుపుతో ఢిల్లీ వేదికగా జరిగే ఈ ఆందోళనను జయప్రదం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కాంగ్రెస్ పార్టీ బలాన్ని ఢిల్లీ వేదికపై చాటిచెబుతామని నేతలు పేర్కొన్నారు.

భారతీయ జనత పార్టీ మండలకార్యవర్గ సమావేశం

నందిపేట్, బతుకమ్మ : నందిపేట్ మండల కార్యవర్గ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోపిడీ స్రవంతి రెడ్డి,జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ స్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేయడంపై, అలాగే నందిపేట్ మండలంలోని సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలపై కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో బిజెపి మండలనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

తిప్పాపూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల పర్యటన...

భిక్కనూరు,బతుకమ్మ :భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి నాయకులు శుక్రవారం పర్యటించారు ఈ సందర్భంగా మండల కమిటీల ఏర్పాట్లో భాగంగా స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో ముచ్చటించారు ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట్ రాములు మాట్లాడుతూ విండో చైర్మన్ పదవుల్లో ఒక్కరికి కూడా జిల్లాలో మాదిగలకు కేటాయించలేదని మాదిగలు చైర్మన్ ల పదవులకు పనికిరారా కాంగ్రెస్ పార్టీకి మాదిగల అంటే చిన్నచూపా మాదిగలు అత్యధికంగా ఉంటే కనీసం ఒక్క చైర్మన్ పదవి కూడా జిల్లాలో ఇవ్వకుండావ్యవహరిస్తున్న తీరు సరికాదని, విండో చైర్మన్లుగా అవకా శం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా కార్యదర్శి సత్తి గారి లక్ష్మి జిల్లా అధ్యక్షురాలు బాణాపురం లావ ణ్య ప్రభాకర్ శ్రీకాంత్ నరేష్ స్వామి ప్రియాంక రామస్వామి దుర్గయ్య రాజయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహణ

నందిపేట్ ,బతుకమ్మ : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్కూల్ పిల్లలకి ఓపెన్ హౌస్ ప్రోగ్రాం నందిపేట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీస్ వారి రోజువారి పని విధానం, పోలీస్ స్టేషన్లో ఉన్న పరికరాలు వివిచ్‌ఎఫ్ సెట్, ఫింగర్ ప్రింట్ తీసే మిషన్ ,సిసిటిఎన్ఎస్ నెట్వర్క్, పోలీస్ స్టేషన్లో నిర్వహించే రికార్డుల గురించి వారికి వివరించారు. దీనిలో కృష్ణవేణి స్కూల్, అక్షర స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఆశీర్వాదం.. మీ దీవెనల కోసమే వచ్చాం

పంటలు వేయవద్దన్న ముఖ్యమంత్రి అధికారంలో ఉండొద్దు

ఆదిలాబాద్ జిల్లాలో ఎకరం నీళ్లు ఇవ్వని బీఆర్ఎస్.. ఏ మొఖం పెట్టుకోని ఇక్కడ గర్జన సభ పెడుతుంది?

సామాజిక న్యాయమని మాట్లాడటం కాదు.. చేతల్లో చేసి చూపిస్తున్నాం

ఆదిలాబాద్ పాంచజన్య సంకల్ప సభలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ఆదిలాబాద్, బతుకమ్మ : తెలంగాణ రక్షణ సేన పార్టీకి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ఆదివాసీల దీవెనలు ఉండాలని..మీ ఆశీర్వాదం కోసమే ఈ జిల్లాకు వచ్చామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పాంచజన్య సంకల్ప సభల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి వద్ద నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి ఘటనను గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లి పాపం కాంగ్రెస్ పార్టీదేనని విమర్శించారు. పంటలు కాపాడుకునేందుకు మీటింగ్ పెట్టుకోవాలనుకున్న ఆదివాసీలను కనికరం లేకుండా పిట్టలను కాల్చినట్లు కాల్చి చంపింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అయిన సరే కాంగ్రెస్ పార్టీ నేతలు క్షమాపణ కోరి ఇంద్రవెల్లి వీరులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో ఇక్కడి ప్రజలు పెద్ద మనసు చేసుకోని ఆ పార్టీకి నాలుగు సీట్లు ఇచ్చారన్నారు. అయిన సరే కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లాను మోసం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ సాధించుకోని 12 ఏళ్లు అవుతున్న సరే ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధి లేదని, 750 ఊళ్లలో కనీసం స్కూల్స్ లేని పరిస్థితి ఉందన్నారు. తలసరి ఆదాయంలో ఆదిలాబాద్ జిల్లా చాలా వెనుకబడి ఉందని, ఈ ప్రాంతంలో రోడ్లు, ప్రాజెక్ట్ లు, అభివృద్ధిని అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీలు నిర్లక్ష్యం చేశాయన్నారు. అడవులు, ఆదివాసీలు సహజ సంపదతో ఉన్నఈ జిల్లాను అభివృద్ధి చేసేందుకు రాజకీయ నాయకులకు మనసు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 12 ఏళ్లుగా తుమ్మడి హెట్టి ప్రాజెక్ట్ పేరుతో ఇక్కడి ప్రజలను బీఆర్ఎస్, కాంగ్రెస్ లు మురిపించాయే తప్ప చేసిందేమీ లేదన్నారు. కాగజ్ నగర్ లో కాగజ్ నగర్ లో లక్షా 5 వేల ఎకరాలకు నీళ్లు రావాల్సి ఉంటే 6 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారని ధ్వజమెత్తారు. ఏళ్లకు ఏళ్లుగా ప్రాజెక్ట్ లను పెండింగ్ పెట్టారన్నారు. తుమ్మిడి హెట్టిని పూర్తి చేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవని చెప్పారు. ఆదివాసీలు ఎక్కువగా ఉండే జిల్లాలో కనీసం వారిని పట్టించుకోవటం లేదని చెప్పారు. ఐటీడీఏ లో జీవో 57 తో సహా 27 జీవోలను మళ్లీ అమలు చేయాలని, 1972 లో ఆస్తులు కొనుక్కున్న ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

పంటలు వేయవద్దన్న ముఖ్యమంత్రి అధికారంలో ఉండొద్దు

చరిత్రలో రైతులను పంటలు వేయవద్దని చెప్పిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనని కవిత అన్నారు. వ్యవసాయం మాత్రమే తెలిసిన రైతులను పంటలు వేయవద్దంటున్న ముఖ్యమంత్రి వారికి ఏ విధంగా న్యాయం చేస్తారో చెప్పాలని నిలదీశారు. పంటలు వేయద్దన్న ముఖ్యమంత్రి పదవి ఉండొద్దన్నారు. అధికారంలోకి రాగానే ఆదిలాబాద్ జిల్లాకు నెలకు రెండుసార్లు వస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి..మూడేళ్లలో రెండుసార్లు మాత్రమే ఇక్కడకు వచ్చారని ఆమె గుర్తు చేశారు. ఇంద్రవెల్లి వీరులకు ఇంద్రవెల్లి వీరులకు రూ. 25 లక్షలు ఇస్తామన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కేవలం రూ. 5 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. ఇంద్రవెల్లి వీరులను కూడా మోసం చేసిన ఘనత కాంగ్రెస్ దేనని మండిపడ్డారు.

బీఆర్ఎస్ ది గర్జన కాదు..తర్జన భర్జన

ఆదిలాబాద్ లో బీఆర్ఎస్ పార్టీ గర్జన సభ నిర్వహిస్తామని చెబుతోందని కానీ వారిది గర్జన కాదు, తర్జన భర్జన అని కవిత ఎద్దేవా చేశారు. సిద్దిపేట, సిరిసిల్ల బాబుల అధిపత్యం కోసం నిర్వహిస్తున్న ఈ సభ కారణంగో క్యాడర్ లో అయోమయం నెలకొందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆదిలాబాద్ కు ఒక్క ఎకరం నీళ్లు ఇవ్వని బీఆర్ఎస్..ఏ మొఖం పెట్టుకోని రైతు గర్జన సభ నిర్వహించటానికి వస్తుందని ప్రశ్నించారు. గర్జన సభ నిర్వహించనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ ఆయనకు పలు ప్రశ్నలు సంధించారు. స్వయంగా కేసీఆరే ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఇస్తానని మాట ఇచ్చినప్పటికీ ఎందుకు ఒక్క యూనివర్సిటీ, కనీసం ఇంజనీరింగ్ కాలేజ్ కూడా ఇవ్వలేదని ప్రశ్నించారు. సిర్పూర్ కాగజ్ నగర్ మిల్లు కోసం ప్రైవేట్ వ్యక్తులకు వటటయ్యి కోట్లు ఇచ్చి..కార్మికులకు ఎందుకు అన్యాయం చేశారో చెప్పాలన్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్..పత్తి ఎక్కువగా పండే ఆదిలాబాద్ లో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేయకపోవటానికి కారణం ఏంటన్నారు. పదేళ్లలో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను, బోధన్ షుగర్ ఫ్యాక్టరీ ఎందుకు తెరిపించలేదో చెప్పాలని నిలదీశారు. సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా మూత పడటానికి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ లే కారణమని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏడున్నర లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే అవకాశం ఉండగా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకపోవటం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు.

సామాజిక న్యాయం చేతల్లో చేసి చూపుతున్నాం

సామాజిక తెలంగాణ సాధించటమే టీఆర్ఎస్ లక్ష్యమని..ఆ లక్ష్యం దిశగా మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నామని కవిత చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు స్థానాలను తమ పార్టీ బీసీలకే ఇచ్చిందన్నారు. పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్, ఆర్థిక బలం లేకపోయినా చదువు, సమాజం కోసం పనిచేసే యువకులకు తాము సీట్లిచ్చామన్నారు. బీసీలకు, యువతకు అవకాశం ఇస్తే రాజకీయాలు మారుతాయని, రాజకీయాలు మారితే రాష్ట్రం మారుతుందన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు చేసేందుకే, ప్రజలను మోసం చేస్తున్న పార్టీలను ప్రశ్నించేందుకే కొత్త రాజకీయ శక్తిగా వచ్చామన్నారు. పాంచజన్యం పేరుతో కీలకమైన ఐదు అంశాలను తాము ప్రాధాన్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రజలకు ప్రైవేట్ లోనూ మెరుగైన ఉచిత విద్య, వైద్యం ఇచ్చి చూపిస్తానని చెప్పారు. యువతకు వ్యాపారం చేసేందుకు రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామన్నారు. రైతులకు అన్ని సౌకర్యాలతో పాటు వారికి గౌరవం దక్కేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి

వెబ్ డెస్క్, బతుకమ్మ : తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై చర్చించారు. హైదరాబాద్ - పుణె, హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ -- కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ) వెంటనే మంజూరు చేయాలని కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి వివరించారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు పక్కనే రీజినల్ రింగ్ రైలుకు కూడా అలైన్‌మెంట్ చేయాలని ముఖ్యమంత్రి కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్- గద్వాల్, కల్వకుర్తి -- మాచర్ల, కాచిగూడ --జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు -- ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ -- లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని అశ్వినీ వైష్ణవ్ గారిని కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409.1 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగిం చేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని గుర్తుచేస్తూ, మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజ్ ఎగవేతకు యత్నం

రైతులను రెచ్చగొడుతున్న దళారులు

ధాన్యం కు గిట్టుబాటు ధర దక్కుతుండగా బ్రోకర్ల పన్నాగం

నిజామాబాద్, బతుకమ్మ :నిజామాబాదు వ్యవసాయ మార్కెట్ కమిటీ నియమించిన ప్రత్యేక బృందం ను జన్నాపల్లి వద్ద శుక్రవారం రాత్రి కొందరు బ్రోకర్ లు అడ్డుకున్నారు. ఏఎంసి వారి కారణం గా లారీలు గ్రామాలకు రావడం లేదని వారిని అడ్డుకోవాలని రైతులను రెచగొట్టారు. మార్కెట్ ఫీజు ను ఎగవేతకు బ్రోకర్ లు గత కొంతకాలంగా మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ ల వద్ద తనిఖీ సిబ్బంది తో గొడవ పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది...వర్ష కాలం వర్షాలు పడకపోయినా పంటలు బాగా పండటం తో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన వరికి ఎప్పుడు లేనంతగా డిమాండ్ ఏర్పడింది. దానితో రైతుల ధాన్యం ను సొసైటీ లు, మహిళ సంఘాలు, మార్కెట్ కమిటీ లు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు తెరువుకముందే మిల్లర్లు, ప్యాడి బ్రోకర్ లు వడ్లను కొనుగోలు చేస్తున్నారు. ఎల్ ని నో ప్రభావం తో కిలో సన్న బియ్యం ధర రూ. 100 దాటడం విశేషం. దానితో పచ్చి వడ్లను కొనుగోలు జోరుగా సాగుతుంది. అదే సమయం లో జిల్లాలో స్థానిక మిల్లర్లు, బ్రోకర్లు కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యాపారులు వచ్చి వడ్లను కొంటున్నారు. అయితే ఈవిషయం లో కొందరు మిల్లర్లు గొడవ చేసిన కర్షకుల దెబ్బకు తోక ముడిచారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన, మిల్లర్లు కొనుగోలు చేసిన వడ్ల తాలూకు డబ్బులు రావడం ఆలస్యం అయ్యేది. కానీ ఇప్పుడు రైతులకు క్వింటల్ కు రూ. 3,000 నుంచి రూ. 3,500 నగదు చెల్లించి కొనుగోళ్లు జరుగుతున్నాయి. అదే సమయం లో ప్రభుత్వం కు ముఖ్యంగా మార్కెట్ ఫీజు ఏగగొట్టే ప్రయత్నం జరుగుతుంది. ఈ విషయం లో దళారులు రైతులు ను రెచ్చగొడుతున్నారు మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ లను దాటెందుకు రైతుల్ని పావులుగా వాడుతున్నారు. రైతులను రెచ్చ గొట్టి ప్రభుత్వ ఆదాయం కు గండి కొట్టె పనిలో ఉన్నారు. ఇటీవల కాలంలో ఇవే ఘర్షణలు జరుగుతున్నాయి.